




# మనం మెదక్

సంగారెడ్డి సిద్దిపేట

మంగళవారం | 7 | నవంబర్ | 2023 | పేజీలు : 9



# పేరుకే సర్కారు

-ఖర్చులన్నీ రైతులపైనే

-అన్నదాతకు తప్పని తిప్పలు

-కొనుగోలు సెంటర్లలో అన్నీ సమస్యలే

-హమాలీ, తరుగు పేరుతో దోపిడీ



2 లో

# పొట్టోడినే కానీ గట్టోడిని



హుస్నాబాద్,నవంబర్ 6,(మనం న్యూస్): హుస్నాబాద్ ఎమ్మెల్యేగా నువ్వు పనికి రావు..అసమర్ధుడు అని స్టేట్‌మెంట్ ఇస్తే ఇది చూసిన కొంత మంది మహిళా బీఆర్ఎస్ నాయకులు నన్ను ''పొట్టోడు గిట్టోడు'' అంటుంటే మనసుకు బాధ అనిపించిన గ్రామాలకు వెళుతుంటే ఆ మాటలు ఏమి పట్టించుకోకు అన్న ''పొట్టోల్లే గట్టోల్లు'' అన్న అని ప్రజలు అంటున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని కూచనపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ మడప జైపాల్‌రెడ్డి సమక్షంలో 400 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆనంతరం పొన్నం మాట్లాడుతూ గ్రామాల్లోని రాజకీయాలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంటాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారకుండా పొరపాటున మళ్ళీ ఈ ప్రభుత్వమే వస్తే తెలంగాణ రూపురేఖలు కనుమరుగువుతాయన్నారు. తెలంగాణ ప్రజలందరూ మార్పును

మిగతా 2లో..

- ఎమ్మెల్యే పై వ్యక్తిగత విమర్శలు చేయలేదు
- పొట్టోడు అంటుంటే మనసుకు బాధవుతుంది
- అభివృద్ధిపై మేము చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యేనే టీ.వి.లల్లో చర్చకు రావట్లేదు
- హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్

# ఆత్మీయ నేతకు అండగా

- రికార్డు మెజార్టీయే లక్ష్యం
- సంక్షేమంలో స్వర్ణయుగం
- రాష్ట్ర వికలాంగుల కార్పోరేషన్ ఛైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి



2 లో



# పొట్టోడినే కానీ గట్టోడిని

మొదటి పేజీ తరువాయి..

కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవడానికి ప్రజలందరూ కంకణం కట్టుకుని ముందుకు సాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు ప్రభుత్వమేర్పాటు కొరకు కాదు ప్రజా సమస్యలను, ఇబ్బందులను తొలగించడానికి మాత్రమే అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు సాధనకు సంబంధించిన నా యొక్క పాత్ర ప్రజలందరికి తెలిసిందే అన్నారు. అటువంటి బిడ్డ హుస్నాబాద్ ప్రాంతం నుండి పోటీ చేస్తుంటే తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులందరూ కదలిరావాలని ఆయన ఆహ్వానం పలికారు. సోనియాగాంధీ తెలంగాణ ఏ ఆకాంక్షల కొరకు ఇచ్చిందో ఆ తెలంగాణ కలను నిజం చేసుకోవడానికి మాతో కలిసిరావాలని ఆయన కోరారు. భవిష్యత్తులో తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తెలంగాణ ఆకాంక్షలను పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి అనేకమైనటువంటి ప్రజా సమస్యలతోటి గ్రామ సర్పంచ్‌గా ప్రజాస్వామ్యంలో ఒక ప్రజాప్రతినిధిగా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారని ఆయన గుర్తు చేసారు. వారి అనుభవం భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి తప్పకుండా వినియోగించుకుంటామని ఆయన తెలిపారు. ప్రభుత్వం మారకపోతే తెలంగాణకు భవిష్యత్తు లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చుకొనే పరిస్థితి లేదన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ప్రతి కార్యకర్త లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, హుస్నాబాద్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా నన్ను గెలిపించినట్లైతే అసెంబ్లీలో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మీ ఇంటికి వస్తాడు హుస్నాబాద్‌కు ఏమి చేసినవో చెప్పమంటే చేతనవుత లేదంటూ ఆయన మండిపడ్డారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు కట్టలేకపోయిన అసమర్థ ఎమ్మెల్యే ఈ నియోజకవర్గానికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేక పోయిడంటూ దుయ్యబట్టారు. సెంటిమెంట్ పేరిట సమావేశాలు తప్ప డేవలప్‌మెంట్ అంతా సిద్దిపేటకు పోతుంటే ప్రేక్షకుడిగా ఉన్నావంటా ఆయన ఆగ్రహాం వ్యక్తం చేసారు. తెలంగాణ కోసం కొట్లాడిన వ్యక్తిగా ప్రజా సమస్యల కోసం పోరాడిన వ్యక్తిగా మీరు నన్ను ఆశీర్వదిస్తారని విశ్వసిస్తున్నానని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా ఎమ్మెల్యేను విమర్శలు చేస్తలేను...పది సంవత్సరాలు హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఏమి చేసినావో టీ.వి.ల చర్చకు అన్న రా...లేదా ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా కూర్చొని మాట్లాడుదాం అంటూ ఆయన సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, నాయకులు అక్కనపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ఎగ్గిడి ఐలయ్య, మండల అధ్యక్షుడు బంక చందు, మడప పెద్దిరెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# పేరుకే సర్కారు

**-క్వింటాల్‌కు రూ. 35 నుండి రూ.45ల వరకు హమాలీ ఖర్చు**

**-వడ్లు వచ్చి నెల కావస్తున్నా ఒక్క గింజా కొనలే**

**-ఆగ్రహిస్తున్న అన్నదాత**

చిన్నకోడూరు, నవంబర్ 06, మనం న్యూస్ః కళ్లముందు రెక్కల కష్టం... కమ్ముకుంటున్న మేఘాలు చూసి రైతన్న ఆవేదన...ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిందన్న ఆనందం కళ్లముందున్నా అన్నదాత మదిలో తెలియని బాధ. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి నెల కావస్తున్నా పంటను కొనుగోలు చేయకపోవడం పగలు, రాత్రి వడ్ల కుప్పల వద్ద రైతన్న కాపలా కాయాల్సి వస్తుంది. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. సర్కారు చెప్పిన దానికి, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదు. వడ్లు తెచ్చి సెంటర్లలో పోస్తున్న రైతులు తమ వడ్లు ఎప్పుడు కాంటా పెడుతారో అంటూ రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వడ్ల కుప్పల వద్దే సమయాన్ని వెచ్చిస్తూ పొలాల వద్ద పనులను చేసుకోలేకపోతున్నామంటూ రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

### -సెంటర్లలో అన్నీ సమస్యలే

కొనుగోలు కేంద్రాలలో తాలు, మట్టి లేకుండా వడ్లు తూర్పారా పట్టేందుకు మిషన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ అధికారులు అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వర్షం వస్తేపంట తడవకుండా టార్పాలిన్ కవర్లు అందించాల్సి ఉన్నా సెంటర్ నిర్వాహకులు టార్పాలిన్‌లు ఇవ్వకపోవడంతో రైతులు తమ వెంట తెచ్చుకున్న పాతవి, చినిగినవి వాడుతున్నారు. కమ్ముకొస్తున్న మేఘాలను చూసి ఎప్పుడు వాన వస్తుందో, తమ పంట గతంలో లాగే తడుస్తుందా అనే డైలమాలో రైతులు ఉన్నారు. మార్కెట్లకు వడ్లు వచ్చి నెల రోజులైనా ఇప్పటి వరకు కొన్ని సెంటర్లలో ప్రారంభాలు చేయకపోవడం విడ్డూరం. పోయినసారి అమ్మిన ధాన్యానికి సంబంధించి రైతులు తమ పంట విక్రయించిన బస్తాలకు ట్రక్ షీట్లను అడగగా రేపిస్తాం, మాపిస్తామంటూ కాలయాపన చేశారే తప్ప ఎప్పటికప్పుడు రైతులకు అందిన బస్తాలకు సంబంధించి ట్రక్ షీట్‌లను ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఐకేపి సెంటర్ల నిర్వహణ తీరుపై ప్రత్యేక దృష్టి



సారించాలని రైతులు కోరుతున్నారు. మొన్నటికి మొన్న తూతూ మంత్రంగా ప్రారంభించిన కొనుగోలు సెంటర్లలో ఇప్పటి వరకు ఒక గింజ కూడా కొనకపోవడం గమనార్హం.

### అన్నదాతపైనే భారం

వడ్లను కొనుగోలు చేసి వాటిని మిల్లులకు తరలించే వరకు అవసరమయ్యే గన్నీ సంచులు, సుతిలి, కాంటా, రవాణా, హమాలీ ఛార్జీలను సివిల్ సప్లై శాఖ భరించాల్సి ఉంది. ఈ ఖర్చులను ప్రభుత్వాలు భరించాల్సి ఉన్నా సెంటర్లలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతుంది. సుతిలి కూడా రైతులే తెచ్చుకోవాలని సెంటర్ నిర్వాహకులు హుకుం జారీ చేస్తున్నారు. కొన్ని కేంద్రాలలో రవాణాకు బస్తాకు రూ.2ల చొప్పున గతంలో వసూలు చేశారు. క్వింటాల్‌కు రూ.35 నుండి రూ. 45 వరకు హమాలీ పేరిట రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. ఇవి చాలవన్నట్లు తేమ, తాలు, తరుగు నెపంతో కిలో నుండి రెండు కిలోల వరకు కోత పెడుతున్నారు. కొన్నిచోట్ల తూర్పారా పట్టకపోతే కిలో నుండి రెండు కిలోలు, తూర్పారా పడితే కేజి వరకు గతంలో తూకం వేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు కనీస వసతుల తిప్పలు తప్పడం లేదు. సెంటర్ల వద్ద లైట్లు, తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాత ఇబ్బందులు పడుతున్నాడు. గత యాసంగిలో రైతులు కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు పడుతున్నారంటూ ఎన్ని వార్తా కథనాలు ప్రచురితమైనా సెంటర్ల నిర్వాహకులకు కనీసం చీమ కుట్టినట్టయినా లేదు. మండల వ్యాప్తంగా 13 ఐకేపి కేంద్రాలు, 7 గంగాపూర్ సొసైటీ, 4 అల్లీపూర్ సొసైటీల ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేసి వడ్లను కొనుగోలు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఒక గింజా కొనకపోవడం శోచనీయం. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే ఖర్చులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పి ఇప్పుడు రైతులతో ప్రతి ఖర్చు పెట్టిస్తున్నారని, ఇప్పటికైనా పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరించాలని రైతులు కోరుతున్నారు.

# గజ్వేల్‌లో నామినేషన్ వేయనున్న నీరుడి ప్రసాద్

**బ్లూ ఇండియా పార్టీ నుండి బి ఫామ్ అందజేత**

గజ్వేల్, నవంబర్ 06, మనం న్యూస్ః గజ్వేల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్లన్న సాగర్ ముంపు గ్రామాల బాధితుడు నీరుడు ప్రసాద్ సీఎం కేసీఆర్ మీద పోటీకి సై అంటున్నాడు. సోమవారం హైదరాబాద్‌లో బ్లూ ఇండియా పార్టీ నుండి బి ఫామ్ అందుకున్నాడు నీరుడి ప్రసాద్. అనంతరం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా త్వరలో నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని, తనమీద నమ్మకంతో గజ్వేల్ ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి బ్లూ ఇండియా పార్టీ బి ఫామ్ రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.




# ఆత్మీయ నేతకు అండగా

సిద్దిపేట, నవంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః ఇంటి మనిషిలా కుటుంబ సభ్యునిలా ప్రతి సందర్భంలో తోడుండే హరీష్‌రావు వెంటే మేమంతా అంటూ దివ్యాంగులు నినదించారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఏ కష్టం రానివ్వకుండా ఆత్మీయత చాటుతున్న అభిమాన నాయకుడు హరీష్‌రావుకు అండగా మేముంటామని, అభివృద్ధిలో సిద్దిపేటను మొదటి స్థానంలో నిలిపిన హరీష్‌రావుకు మెజార్టీలోనూ అదే స్థానం అప్పగిస్తామంటూ నిన దించి ఏకగ్రీవ తీర్మాణం చేశారు. సోమవారంనాడు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల ఆత్మీయ సమావేశం జరగగా రాష్ట్ర వికలాంగుల కార్పోరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పి ఛైర్పర్సన్ రోజాశర్మలు పాల్గొన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులంతా బిఆర్ఎస్ ప్రభుత్వానికి బాసటగా, హరీష్‌రావుకు అండగా ఉంటామంటూ ఏకగ్రీవ తీర్మానం అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఏకైక ప్రభుత్వం బిఆర్ ఎస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్, బీజేపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా కూడా తెలంగాణలో మాదిరిగా దివ్యాంగులకు ప్రభుత్వం బాసటగా నిలబడలేదని, ముఖ్యమంగా సిద్దిపేటలో ప్రతి విషయంలో తోడుంటున్న హరీష్‌రావు భారీ విజయంలో దివ్యాంగుల భాగస్వామ్యం ఉందని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గత ప్రభుత్వాలు 30 నుండి 40 శాతం సబ్సిడీ మాత్రమే భరించేవని, కానీ మానవత్వం కలిగిన కేసీఆర్ హయాంలో వికలాంగులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో వందశాతం ఉత్తీర్ణతో వాహనాలను అందజేసిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అత్యంత ఎక్కువగా పొందుతున్నది దివ్యాంగులేనని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ముఖ్యమైన ప్రచారకులు దివ్యాంగులే కావాలన్నారు. ఎన్నికల వేళ కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపిల మాటలు నమ్మవద్దని, అన్ని రంగాల్లో సిద్దిపేటను మొదటి స్థానంలో నిలిపిన హరీష్‌రావుకు మెజార్టీలోనూ





మొదటి స్థానమే

ఇవ్వాలన్నారు. ఈసారి ఎన్నికల్లో దివ్యాంగులు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు సైతం బిఆర్ఎస్ పార్టీకి ఓటేసేలా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏ చిన్న ఆపద వచ్చినా ఏ పని పడ్డా వెనువెంటనే పరిష్కరించే అభిమాన నాయకుడు హరీష్‌రావు వెంటే అడుగులో అడుగు వేయాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పి ఛైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ దివ్యాంగులు అవయవాల పరంగా మాత్రమే దివ్యాంగులు కావచ్చని, ఆత్మవిశ్వాసంలో మాత్రం అందరికీ ఆదర్శమన్నారు. సమాజంలో సమున్నతంగా బతికేందుకు అనేక కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్న బిఆర్ఎస్‌కు, ముఖ్యంగా ఏ చిన్న కష్టం వచ్చినా కుటుంబ సభ్యునిలా భావించే హరీష్‌రావు వెంటే ఉంటామంటూ ఇంతపెద్ద సంఖ్యలో దివ్యాంగులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం ప్రతినిధులు దండు శంకర్, మున్న, కట్కూరి యాదగిరి, బాలమణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారెంటీలు



కోహెడ,నవంబర్ 6,(మనం న్యూస్)ః వారంటీ లేని కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మొద్దని హుస్నాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని వింజపల్లి, రాంచంద్రాపూర్, వరికోలు, ఎర్రగుంటపల్లి, చెంచల్‌చెర్వుపల్లి, కాచాపూర్, మైసంపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు సతీశ్‌కుమార్‌కు తిలకం దిద్ది మంగళ హారతులు పట్టగా డప్పు చప్పుళ్ళతో ఆయన ఘనస్వాగతం పలికారు. ఆనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతున్నదని, ప్రస్తుతం రాష్ట్రం ఆ దిశగా పరుగులు పెడుతున్నదని అన్నారు. అభివృద్ధి ఆగిపోకుండా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్ళీ కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల కుట్రలను ప్రజలు తరిమికొట్టలన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టో రూపొందించారని ఆయన తెలిపారు.హుస్నాబాద్ ప్రాంతం అప్పుడెట్లుండే ఇప్పుడెట్లయ్యింది అన్నారు. నాడు కష్టాలు, కన్నీళ్ళు తప్ప సంతోషం ఉందా అంటూ ఆయన ప్రశ్నించారు. స్వరాష్ట్రంలోనే సంక్షేమ పాలన అన్నారు. సీఎం కేసీఆర్‌ది ప్రజలు మెచ్చిన పాలన అన్నారు. స్వపరిపాలనలో పల్లెలన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30 న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మూడోసారి పోటీలో ఉన్నానని కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రశీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి-సురేశ్, జడ్పీటీసీ నాగరాజు శ్యామల, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పేర్యాల రవీందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, బీఆర్ఎస్ పార్టీ మండల యువత అధ్యక్షుడు జాలిగం శంకర్, మండల ఉపాధ్యక్షుడు తిప్పారపు నాగరాజు, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు,



కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారెంటీలు

**- చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి**

**- బీఆర్ఎస్ హయాంలోనే అద్భుత ప్రగతి**

**- సీఎం కేసీఆర్‌ది ప్రజలు మెచ్చిన పాలన**

**- స్వపరిపాలనలో ఆదర్శంగా పల్లెలు**

**- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్**



కార్యకర్తలు, తదితరులున్నారు.

# బీజేపి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

**-రఘునందన్‌రావు గెలిచాక కుంటుపడిన అభివృద్ధి**

**-మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం**

మిరుదొడ్డి, నవంబర్ 06, మనం న్యూస్ః బీజేపి నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డిమండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపిల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కేవలం వారి





రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే ప్రతిపక్ష నాయకులు ఎన్నికల ముందు గ్రామాల్లో ప్రచారానికి దిగుతున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికల్లో బీజేపి పార్టీ రఘునందన్‌రావు గెలిచిన తర్వాత దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో కుంటు పడిందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి కారు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సాయిలు, వైస్ ఎంపిపి పోలీస్ రాజులు, సర్పంచ్ రాములు, బిఆర్ఎస్ నాయకులు గొట్టం బైరయ్య, ధర్మారం బాబు, చార్వాక కుమర్, రాధాకృష్ణ, సత్యనారాయణ, లింగం, మల్లయ్య, యాదగిరి, మల్లేశం, సాయి, ఐలయ్యతోపాటు తదితరులు ఉన్నారు.



## కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తున్న హరీష్‌రావు

**-రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులే బాగుపడ్డారు**

**-డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు**

చిన్నకోడూరు, నవంబర్ 06, మనం న్యూస్ః మంత్రి హరీష్‌రావు కల్లబొల్లి మాటలు చెప్తూ కాలం గడుపుతున్నాడని డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు విమర్శించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో కమీషన్‌లు వచ్చే పనులకు తప్ప ప్రజా సంక్షేమానికి ప్రధాన్యాత ఇవ్వలేదన్నారు. వివిధ పథకాలతో బిఆర్ఎస్ నాయకులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గ్రామాలలో బిఆర్ఎస్ పార్టీపై ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో నిశ్శబ్ధ ఓటింగ్ ద్వారా కాంగ్రెస్ పార్టీకే పట్టం కడుతారని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగుల డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

కొండపాక, నవంబర్ 06, మనం న్యూస్ః పాఠశాలలో ఎంతో కాలంగా ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ నేడు దిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండల పరిధిలోని బందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పెద్ది విఠల్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రం, ఉపాధ్యాయులు నిమ్మ వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ది విఠల్‌ను ఘనంగా శాలువాతో సన్మానించి



ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు ఆయన పాఠశాలకు చేసిన సేవల పట్ల కొనియాడారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



తొగుట, నవంబర్ 06, మనం న్యూస్ః తొగుట మండలం తుక్కాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్య సమ్యతో మరణించిన గండ్యాల గంగవ్వ కుటుంబానికి సోమవారం గ్రామ యూత్ సభ్యులు 50 కిలోల బియ్యం అందించారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తుక్కాపూర్ గ్రామ యూత్ సహాయార్ధంగా గండ్యాల ఆంజనేయులుకు బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో చెరుకు లక్ష్మారెడ్డి, వంగ కనకయ్య, చిక్కుడు రమేష్, చిక్కుడు శ్రీనివాస్, బి. కరుణాకర్, బి. స్వామి, బి. కనకయ్య, బోయిని బాలరాజు, బి. రవి, లింగాల స్వామి, దూలం నవీన్, దూలం రాములు, గుడిసె బాబు, లింగాల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయని నాయకులను తరిమికొట్టాలి

-నేటికీ కనిపిస్తున్నది ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధే

-కమీషన్‌లకు కక్కుర్తి పడ్డ బిఆర్ఎస్ నాయకులు

-దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి







మిరుదొడ్డి, నవంబర్ 06, మనం న్యూస్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకుండా తూతూ మంత్రంగా అమలు చేస్తూ మళ్లీ ప్రజలను ఓటు అడిగేందుకు వస్తున్న నాయకులను తరిమి కొట్టాలని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి గ్రామంతోపాటు మండల పరిధిలోని లింగుపల్లి, మల్లుపల్లి, చెప్యాల, అల్వాల గ్రామాలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ఆత్మగౌరవాన్ని సిద్దిపేట నాయకులకు తాకట్టు పెట్టే బిఆర్ఎస్ నాయకులు కావాలా లేదా అభివృద్ధి చేసే నాయకులు కావాలో తేల్చుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికీ గ్రామాల్లో కనబడుతున్నాయన్నారు. కానీ బిఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని విమర్శించారు. బీజేపి, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ప్రజలను మోసం చేసేందుకే గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. బీజేపి, బిఆర్ఎస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మవద్దని సూచించారు. దుబ్బాకలో బిఆర్ఎస్ ఓడిపోతుందనే భయంతో ఎంపి ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిపై కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధి పేరుతో కమీషన్‌లకు కక్కుర్తిపడి బిఆర్ఎస్ నాయకులు వారి కుటుంబాలు బాగు చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అందిచండం జరుగుతుందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటేసి తనను గెలిపించినట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రచారం నిర్వహించిన గ్రామాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

-కాంగ్రెస్‌లో చేరిన బీజేపి నాయకులు

అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో సుమారు 60 మంది బీజేపి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం, అమర్, రత్నారెడ్డి,మహేష్, హర్షద్, జహంగీర్, భాస్కర్, వెంకటస్వామిగౌడ్, బాల్‌నర్సాగౌడ్, అశోక్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

వైస్ ఎంపిపి బాసిరెడ్డిగారి శ్రీకాంత్‌రెడ్డి



తొగుట, నవంబర్ 06, మనం న్యూస్: బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తాయని తొగుట వైస్ ఎంపిపి బాసిరెడ్డిగారి శ్రీకాంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తొగుట మండలం లింగంపేట గ్రామంలో దుబ్బాక నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలతోపాటు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, చేయబోయే పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు ఇంటింటి ప్రచారంలో వివరించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ దోమల కొమురయ్య, మాజీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు అరుణ్, గ్రామ సర్పంచ నర్సింలు, మాజీ ఏఎంసి ఛైర్మన్ కనకయ్య, తొగుట ఎంపిటిసి రమేష్, బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్, వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ లక్ష్మణ్, నాయకులు ఐలయ్య, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొండపాక, నవంబర్ 06, మనం న్యూస్: వర్షాకాలం వరి కోతలు ప్రారంభం కావడంతో తొగుట మండలం రాంపూర్ గ్రామంలో కాన్గల్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాంపూర్ గ్రామం వాగుగడ్డ వద్ద ఉన్న పాక్స్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ సిఈఓ గంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజేష్, సెంటర్ ఇంచార్జ్ స్వామి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డిపై శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు మానుకోవాలి

కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదు


హితవు పలికిన బిఆర్ఎస్ నాయకులు



మిరుదొడ్డి, నవంబర్ 06, మనం న్యూస్: కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలని ఆత్మ కమిటీ ఛైర్మన్ భాస్కరాచారి, ఎంపిపి సాయిలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు తుమ్మల బాల్‌రాజు, మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి హితవు పలికారు. సోమవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మెదక్ ఎంపి ప్రభాకర్‌రెడ్డిపై కత్తిపోటు జరగడంతో బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆందోళనలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదేవిధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే మాత్రం కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా వారు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పోలీస్ రాజులు, నాయకులు సుతారి నర్సింలు, హైమద్, భూపతి గౌడ్, సత్యనారాయణ, బైరయ్య, బాల్‌నర్సింలు, నర్సింహారెడ్డి, శేఖర్, స్వామితోపాటు తదితరులు ఉన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

ప్రచారం అనంతరం మండలంలో ప్రచారం



కొమురవెల్లి, నవంబర్ 06, మనం న్యూస్: కాంగ్రెస్ పారీట జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని పట్నం వేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంతోపాటు మండలంలోని రసూలాబాద్, ఐనాపూర్, రామసాగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చసిన అభివృద్ధిని, తపాస్‌పల్లి



రిజర్వాయర్ కట్టించి 564 అడుగుల ఎత్తున్న ప్రాంతానికి నీళ్లు అందించిన ఘనత తమదే అన్నారు. ఒక రకంగా చెప్పాలంటే మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, సీఎం కేసీఆర్‌పై ఘాటుగానే విరుచుకుపడ్డారు. అనంతరం కొమురవెల్లి మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిటిసిలు లింగంపల్లి కవిత కనకరాజు, కొయ్యడ రాజమణి శ్రీనివాస్, మద్దూరు జెడ్పిటిసి గిరి కొండల్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, చేర్యాల మండల పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, సీనియర్ నాయకులు మహదేవుని శ్రీనివాస్, కొమ్ము రవి, కొమ్ము నర్సింగరావు, రామగళ్ల పరమేశ్వర్, వల్లాద్రి అంజిరెడ్డి, సార్ల లింగం, పోతుగంటి రవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ చేసింది శూన్యం

## ఎక్కడ చూసినా కాంగ్రెస్ చేసిన అభివృద్ధే

### రామగళ్ల పరమేశ్వర్

చేర్యాల, నవంబర్ 06, మనం న్యూస్‌: తొమ్మిదిన్నరేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, అభివృద్ధి శూన్యమని డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ అన్నారు. సోమవారం చేర్యాల పట్టణంలోని పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో నేడు నియంత పాలన సాగుతుందన్నారు. ఎక్కడ చూసినా నాడు కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పార్టీ అధికారంలోకి రాగానే పూర్తిగా అమలు చేయడం జరుగుతుందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో భూమిగారి మహేందర్, భూమిగారి మధుకర్, బసవగళ్ల నవీన్, రామగళ్ల రాకేష్, కిషోర్, మాచర్ల బాబు,



గట్ల ప్రభాకర్‌తోపాటు వందమంది ఉన్నారు. ఈక ఆర్యక్రమంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి, అరుణ, మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, పూర్మ ఆగంరెడ్డి, ఉడుముల భాస్కర్‌రెడ్డి, మంచాల చిరంజీవులు, ఒగ్గు మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ యువత

### కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

కొండపాక, నవంబర్ 06, మనం న్యూస్‌: కొండపాక మండల పరిధిలోని బందారం గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు మాజీ శాసనసభ్యులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం బందారం గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొండపాక మండల కాంగ్రెస్ అధ్యక్షులు లింగారావు, యువజన అధ్యక్షులు బట్ట పరశురాములు నాయకత్వంలో తూముకుంట నర్సారెడ్డి చేతుల మీదుగా కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వార్డు సభ్యులు దుద్దెడ నరేష్ గౌడ్, ర్యాగల రాజు, దుంబాల వెంకటేష్, దుంబాల స్వామి, జెట్టి రమేష్, గంగుల కిష్టయ్య, దండుగుల ఆంజనేయులు, దండుగుల ప్రశాంత్, కొన్నె రాజు, గొట్టి పెద్దమల్లేశం, చింతల శ్రీనివాస్, కొమురవెల్లి అఖిల్, గణేష్‌తోపాటు పలువురు చేరారు.

# సమస్యల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులు

### డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి



తొగుట, నవంబర్ 06, మనం న్యూస్‌: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట చేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన తొగుట మండలం వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు పెంచిన రూ. 2 వేలు వేతనాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణుతో కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు సరిగా ఇవ్వక వారిచేత వెట్టిచాకిరీ చేయించుకుంటూన్నారన్నారు. నిత్యావసరాల ధరలు పెరగుతున్నా వారి వేతనాలు పెరగకపోవడంతో వారు అప్పులపాలవుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కార్మిక చట్టాలు తీసివేయడం జరిగిందని దీని ద్వారా కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారి సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

## భారీ మెజార్టీయే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడాలి



ములుగు, నవంబర్ 06, మనం న్యూస్‌: కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జహంగీర్‌లు అన్నారు. సోమవారం రోజున బండతిమ్మాపూర్, బస్వాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోనే నేడు గజ్వేల్ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఈసారి ఎన్నికల్లో కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జయమ్మ అర్జున్ గౌడ్, రాష్ట్ర యువత విభాగం ఉపాధ్యక్షులు జుబేర్ పాషా, ఎంపిపి ఉపాధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు సలీం, పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్, ఏఎంసి వైస్ ఛైర్మన్ భూపాల్‌రెడ్డి, కేబిఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గణేష్ గుప్త, రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు నరసింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు వంగ అక్షితరెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

### ఏపియం కృష్ణారెడ్డి



మిరుదొడ్డి, నవంబర్ 06, మనం న్యూస్‌: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకొని రైతులు లబ్ధి పొందాలని ఏపియం కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి, అక్బర్‌పేట, భూంపల్లి మండలాల పరిధిలోని లక్ష్మీనగర్, కొండాపూర్, లింగుపల్లి, అల్వాల, ఖాజీపూర్, అల్మాజ్‌పూర్, కూడవెల్లి, అక్బర్‌పేట గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల వద్దనే ఆరబోసుకొని కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ .2203, బి గ్రేడ్‌కు రూ. 2183 ధరను ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిఏలు, విఓఏలు, హమాలీ కార్మికులు తదితరులు ఉన్నారు.





## ప్రభాకర్‌రెడ్డికి ఘన విజయం అందించాలి

### మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, నవంబర్ 06, మనం న్యూస్‌: దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తుందని, ప్రజలు ఆయనకు ఘన విజయాన్ని అందించాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలో ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా బండారపల్లి, మెట్టు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజల నుండి ప్రభాకర్‌రెడ్డి పట్ల అపూర్వ స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఎల్లారెడ్డిపేట దర్గాలో ప్రభాకర్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో రావాని, ఘన విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆత్మ కమిటీ ఛైర్మన్ లక్కరసు ప్రభాకర్‌వర్మ, సర్పంచ్, ఎంపిటిసిలు సిరినేని గోవర్ధన్‌రెడ్డి, కుంభం శారదా రఘోత్తంరెడ్డి, వేల్పుల స్వామి, కో ఆప్షన్ సభ్యులు ఎండి కలీమొద్దీన్, ఏఎంసి వైస్ ఛైర్మన కంది రాంరెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తల తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను గెలిపిద్దాం



కొండపాక, నవంబర్ 06, మనం న్యూస్‌: అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దామని పలువురు బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కుకునూరుపల్లి రామచంద్రాపూర్, తిప్పారం, మాత్‌పల్లిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, ఈజిఎస్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ కోల సద్గుణ మాట్లాడుత0ఊ గ్రామాల్లోని ఓట్లన్నీ గంపగుత్తగా కారు గుర్తుకే పడాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాయని, మరింత అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అమరేందర్, రుషి, కాచం నవీన్‌కుమార్, కందూరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న జనగామ జిల్లా కలెక్టర్

### ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు



కొమురవెల్లి, నవంబర్ 06, మనం న్యూస్‌: కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారిని జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్య సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపిఓ మంజుల, వీరరాజు, ఆలయ స్థానాచార్యులు మల్లేశం, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు రవి, భాస్కర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం



కొండపాక, నవంబర్ 06, మనం న్యూస్‌: రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ,సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మరోసారి రాష్ట్రంలో సీఎంగా గెలిపించుకోవాలని డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర హౌజింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి అన్నారు. కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లి, రవీంద్రనగర్, వెలికట్ట, ఆరెపల్లి గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం వారు మాట్లాడారు. సమాజంలో ప్రతి వ్యక్తి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచిన కేసీఆర్‌ను మూడవసారి ముఖ్యమంత్రిగా చేయడం మనందరి బాధ్యతగా భావించాలన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు లేకుండా గ్రామాలను అభివృద్ధిపరిచి పట్టణాలుగా తీర్చిదిద్దిన కేసీఆర్‌కు అండగా నిలుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్, భారత జాగృతి కార్యదర్శి అనంతుల ప్రశాంత్, మాజీ ఎంపిపి అనంతుల పద్మ నరేందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు చిట్టి మాధురి, రైతుబంధు సమతి మండల కో ఆర్డినేటర్ ర్యాగళ్ల దుర్గయ్య, సమన్వయ కమిటీ సభ్యులు సురేందర్‌రావు, గోనె శ్రీనివాస్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు సాయిబాబా గౌడ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఆరెపల్లి మహదేవ్ గౌడ్, గ్రామ సర్పంచ్ అమ్ముల రమేష్, నాయకులు కనకయ్య పాల్గొన్నారు.

## ఎంపి స్వగ్రామంలో బిఆర్ఎస్‌కు భారీ షాక్

### కాంగ్రెస్‌లో చేరిన 25 మంది గ్రామస్తులు



దుబ్బాక, నవంబర్ 06, మనం న్యూస్‌: బిఆర్ఎస్, బీజేపి చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అని దుబ్బాక కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు 25 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, బీజేపి పార్టీలు ఇచ్చిన మోసపూరిత వాగ్ధానాలతో అమలు చేయని హామీలతో ప్రజలు విసిగిపోయారని, ఈసారి ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్, బీజేపిలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేస్తుందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి ఇందిరమ్మ పాలన తిరిగి తెచ్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు కొంగరి రవి, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, అనంతుల రాజు, సంజీవులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక బరిలో పల్లెటూరు

సిద్దిపేట, నవంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః దుబ్బాక శాసనసభ ఎన్నికల్లో భాగంగా స్వతంత్ర అభ్యర్థిగా పెద్దలింగన్నగారి (పల్లెటూరు) ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. లింగుపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా, జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ప్రసాద్ ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా ఓట్లను సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదంతో బరిలో ఉంటున్నానని ప్రసాద్ తెలిపారు. పేదలకు విద్య, వైద్యం దూరం చేయాలనే కుట్రతో ప్రభుత్వాలు ఉంటున్నాయని, ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఎప్పటికప్పుడు వేయకుండా చదువుకున్న యువతను పెడదారి మార్గంలో పయనింపజేసేందుకు ఊతమిస్తుందన్నారు. పేపర్ లీకేజీలు లేకుండా, కేసులు లేకుండా ఒక్కచోట కూడా నోటిఫికేషన్‌లు వేసిన దాఖలాలు లేవని, ఈసారి ఎన్నికల్లో నిరుద్యోగులు, విద్యావంతులు ప్రభుత్వ పాలన అసమర్థతకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కనీస ఉత్తీర్ణత లేని పాలకులు నేడు పాలిస్తున్నారని, ఫలితంగా చదువుకున్నోడి విలువ, ఉద్యోగం విలువ తెలియకుండా పోతుందన్నారు. గతంలో ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి మినహా ఇటీవలి కాలంలో ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దుబ్బాకలో డిగ్రీ కాలేజి ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయి వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైన తీరుకు నిరసనగా బరిలో ఉంటున్నానన్నారు. దుబ్బాక రోడ్లపై ప్రసవానికి వెళ్లే మహిళలు సైతం ప్రయాస పడుతున్నారని, కనీసం రోడ్లను బాగు చేసిన పాపాన పోలేదన్నారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్ స్వప్నం అందని ద్రాక్షగా మిగిలిందని, అల్వాల వాగు వంతెన నిర్మాణం అటకెక్కిందన్నారు. ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధులుగా నిలిచే జర్నలిస్టుల కోసం రూ. 25 లక్షలతో అనుమతులు ఇచ్చినట్టే ఇచ్చి వాటిని కాగితాలకే పరిమితం చేశారన్నారు. రాబోయే ఎన్నికలు అత్యంతగా ఆలోచించి వేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని, ఒక్కసారి ఆలోచించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాల్సిందిగా పల్లెటూరి ప్రసాద్ కోరారు.



## పార్టీ కోసం పని చేయాలి

### సిద్దిపేట బీజేపి అసెంబ్లీ ఇంచార్జ్ రాజేష్ పిళ్లై



సిద్దిపేట, నవంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః కార్యకర్తలందరూ సమిష్టిగా పార్టీ గెలుపు కోసం పని చేయాలని మహారాష్ట్ర బీజేపి నాయకులు సిద్దిపేట అసెంబ్లీ ఇంచార్జ్ రాజేష్ పిళ్లై అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, ఎన్నికలకు తక్కువ సమయం ఉండడంతో పార్టీ శ్రేణులంతా 24 గంటలు కష్టపడాలన్నారు. కాంగ్రెస్, బీజేపి పార్టీలు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని బీజేపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, ఉడుత మల్లేశం, కోడూరి నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, కుమార స్వామి, పర్శరాములు, గోనె మార్కండేయులు, నాగరాజు, తొడుపునూరి వెంకటేశం, అంబటిపల్లి శ్రీనివాస్, యాదన్‌రావు, దాబా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాన



సిద్దిపేట రూరల్, నవంబర్ 06, మనం న్యూస్‌: ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెరగాలని ఓహె వైష్ణవ ఠాకూర ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఆయుర్వేద వైద్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఇందిరా నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మల్టీ పర్పస్ బాలుర పాఠశాలలో ఉచిత స్వర్ణ ప్రాశాన ఆయుర్వేద వైద్య శిభిరం, ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వర్ణ ప్రాశాన ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హోమియోపతి వైద్యులు డా. దేవేందర్, ప్రధానోపాధ్యాయులు రాజా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకునేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే

### కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



చేర్యాల, నవంబర్ 06, మనం న్యూస్‌: పేదలను ఆదుకున్నది, ఆదుకోబోయేది కాంగ్రెస్ పార్టీయే అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం చుంచన కోట, వీరన్నపేట, ముస్త్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్లినా ఏ వాడకు వెళ్లినా నాటి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు తప్ప బిఆర్ఎస్ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి కనిపించడం లేదని, కేసీఆర్ ఏ ఒక్క ఊరికైనా ఇండ్లు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే భూమిలేని పేదలకు,కౌలు రైతులకు అండగా ఉం టుందన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మాట తప్పి గారడీ వేషాలు వేస్తు న్నాడని విమర్శించారు. కేజీ నుండి పిజి వరకు ఉచిత విద్య అందిస్తానని చెప్పి కార్పోరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తూ విద్యారంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. పదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కావున ప్రజలు ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. వారి వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొన్నాల చెక్‌పోస్టును తనిఖీ చేసిన అడిషనల్ డిసిపి



సిద్దిపేట అర్బన్, నవంబర్ 06, మనం న్యూస్‌: ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా నగదు, మద్యం సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డిసిపి మల్లారెడ్డి అన్నారు. సోమవారం పొన్నాల చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నియమావళి ప్రకారం పది చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా వస్తువులు, మాదక ద్రవ్యాల సరఫరాను అరికట్టేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈకార్యక్రమంలో రూరల్ సిఐ చేరాలు, రూరల్ ఎస్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట క్రీడాకారుల ప్రభంజనం



సిద్దిపేట రూరల్, నవంబర్ 06, మనం న్యూస్‌: సిద్దిపేట జిల్లా రూరల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలలో సిద్దిపేట జిల్లా విద్యార్థులు అండర్ – 14 విభాగంలో కబడ్డీలో బాలికలు మొదటి బహుమతి, ఖో ఖో ఆటలో బాలురు తృతీయ బహుమతి, అండర్ – 19 విభాగంలో ఖోఖోలో మొదటి బహుమతి సాధించినట్లు జిల్లా అధ్యక్షులు ఇప్ప నర్సింహారాయుడు తెలిపారు.ఈ సందర్భంగా వారిని అభినందించారు.



## బీజేపి గెలుపు రాష్ట్ర రాజకీయాలకు మలుపు

### -బీజేపిలోకి భారీగా చేరికలు

### -బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాక, నవంబర్ 06, మనం న్యూస్‌ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీజేపితోనే సాధ్యమవుతుందని బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం రోజున దుబ్బాకలోని తన స్వగృహంలో తొగుట మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామం, చేగుంట మండలం ఉల్లితిమ్మాయిపల్లి గ్రామాల నుండి పలువురు వార్డు మెంబర్లు బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీజేపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేసి బీజేపి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీజేపితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజల్లో రఘునందన్‌రావుకు వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారి ప్రచారాలను తిప్పి కొట్టాలంటే ప్రతి ఒక్కరు ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. గతంలో వార్డు మెంబర్‌గా గెలిచినప్పుడు ఎలా ప్రచారం చేశారో ఇప్పుడు బీజేపి కోసం ప్రతి ఇంటికి తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బీజేపి నాయకులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్‌రెడ్డికి మద్ధతుగా కాంగ్రెస్ నాయకుల ప్రచారం



దౌల్తాబాద్, నవంబర్ 06, మనం న్యూస్‌ః కుటుంబ పాలన నిర్మూలించడానికి కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పడాల రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి మద్ధతుగా ఆరు గ్యారంటీలను ఇంటింటికి తిరుగుతూ వివరించారు. దుబ్బాక నియోజకవర్గంలో దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దశరథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భద్రయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు బండారు లాలు మల్లారెడ్డి, ఎర్రన్నతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులపై వీధి కుక్కల దాడి

### ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు





సిద్దిపేట రూరల్, నవంబర్ 06, మనం న్యూస్‌ః సిద్దిపేట పట్టణంలో పలు కాలనీల్లో వీధి కుక్కల దాడిలో పలువురు తీవ్రగాయాల పాలయ్యారు. ఆదివారం రాత్రి హనుమాన్ నగర్‌లో మోక్షజ్ఞ, కార్తీక్‌లపై కుక్కలు దాడి చేయగా, కార్తీక్ అనే అబ్బాయికి తీవ్ర గాయాలు కాగా సర్జరీ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. శంకర్‌నగర్‌లో ఆరుబయట ఆడుకుంటున్న పరమేశ్వర్ అనే బాలున్ని గాయపరచగా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మురళి అనే వ్యక్తిని విఏఆర్ అపార్ట్‌మెంట్‌లోని వాచ్‌మెన్‌పై దాడి చేసి తీవ్ర గాయాలు చేయగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిల్లల తల్లిదండ్రులు, కాలనీవాసులు వీధి కుక్కల పట్ల చర్యలు తీసుకొని పిల్లలకు తగిన రక్షణ కల్పించాలని కోరారు.

## స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

### -ఓటును వినియోగించుకునేలా చైతన్యం చేయాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్





సంగారెడ్డి, నవంబర్ 06, మనం న్యూస్‌ః జిల్లా వ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ సంబంధిత నోడల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఆయా నోడల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, రవాణా, పరిశ్రమలు, డిడబ్ల్యూఓ ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడబ్ల్యూడి ఓటర్ల మార్కింగ్ లిస్టు ప్రకారం ఎంత మందికి రవాణా సౌకర్యం అవసరమవుతుందో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని పిడబ్ల్యూడి అధికారికి సూచించారు. 80 ఏళ్లు దాటిన వారికి, దివ్యాంగ ఓటర్లకు తమ ఇంటి నుండే ఓటు వేసే వెసులుబాటు ఉన్నందున బిఎల్‌ఓలకు పోస్టల్ బ్యాలెట్‌లు అందించాలన్నారు. పరిశ్రమల్లో పని చేస్తున్న వారు, ఇతర కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 712 పరిశ్రమల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకునేలా వారిలో చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. కళాజాత బృందాలు, ఎల్‌ఈడి డిస్‌ప్లే, పాటల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ నగేష్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా ప్రచారం



దౌల్తాబాద్, నవంబర్ 06, మనం న్యూస్‌ః దౌల్తాబాద్ మండల పరిధిలోని చెట్లనర్సంపల్లి, ఇందుప్రియాల్ గ్రామాలలో ఎంపిపి గంగాధర్ సంధ్య, జెడ్పిటిసి రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్ బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి బిఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రబాకర్ రెడ్డికి మద్ధతుగా ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. బిఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరిసూ ఎంపి ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడం జరుగుఉతందన్నారు. రెండున్నరేళ్లలో ఎమ్మెల్యేగా రఘునందన్‌రావు చేసిందేమీ లేదన్నారు. ఈ సారి ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రణం శ్రీనివాస్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన వేమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్‌ల పర్వం



దుబ్బాక టౌన్, నవంబర్ 06, మనం న్యూస్‌ః త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా దుబ్బాక అసెంబ్లీ స్థానానికి నామినేషన్‌ల దాఖలు పర్వం కొనసాగుతుంది. సోమవారం రోజున రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ తరుపున గౌటి మల్లేష్, ధర్మ సమాజ్ పార్టీ తరుపున వేముల వెంకట ప్రసన్న, స్వతంత్ర అభ్యర్థిగా పెద్దలింగన్నగారి ప్రసాద్‌లు నామినేషన్ దాఖలు చేసినట్లు దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరిమా అగ్రవాల్ తెలిపారు.





# అభివృద్ధిని ఆదరిద్దాం...

### ఇంటింటి ప్రచారంలో బీజేపి నాయకులు

దుబ్బాక టౌన్, నవంబర్ 06, మనం న్యూస్‌ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పరితపించే ఎమ్మెల్యే రఘునందన్‌రావును ఈసారి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధిని ఆదరిద్దామని బీజేపి నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 38, 39 బూత్‌లలో సోమవారం వారు బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత బిఆర్‌ఎస్ హయాంలో లేని అభివృద్ధి నేడు కేవలం రెండున్నరేళ్లలో ఎమ్మెల్యేగా రఘునందన్‌రావు చేసి చూపించారని, ఆ మార్పును ప్రజలంతా గుర్తించి మరోసారి పూర్తిస్థాయి అవకాశం ఇవ్వాలని కోరారు. ఐదేళ్లు బీజేపికి అవకాశమిస్తే సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాకను అభివృద్ధి చేస్తారని, ప్రజల కోసం పని చేసే, ప్రశ్నించే నాయకుడిని గెలిపించుకుందామని, ఇందుకు ప్రతి ఒక్కరు నవంబర్ 30న కమలం పువ్వు గుర్తుకు ఓటేసి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు సుంకు ప్రవీణ్, బోయ రాజశేఖర్, సప్తగిరితోపాటు తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి చేయూత



దౌల్తాబాద్, నవంబర్ 06, మనం న్యూస్‌ః దౌల్తాబాద్ మండల పరిధిలోని షేర్‌పల్లి బందారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాందాపురం యాదగిరి కుటుంబాన్ని గంప రవి, జక్కుల చంద్రం సోమవారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారికి 50 కిలోల బియ్యం, వేయి రూపాయల నగదు అందించారు. వారి కుటుంబానికి తాము అన్ని రకాలుగా అండగా ఉంటామని, అధైర్యపడవద్దని సూచించారు.

## పిఏసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దౌల్తాబాద్, నవంబర్ 06, మనం న్యూస్‌ః రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయించాలని సిఈఓ మల్లేశం సూచించారు. సోమవారం మండల పరిధిలోని గాజులపల్లి, దొమ్మాట గ్రామాల్లో పిఏసిఎస ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం అందిస్తున్న మద్ధతు ధరకు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ధాన్యం కల్లాల వద్ద ఆరబెట్టి తేమశాతం లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో తమ వెంట ఆధార్‌కార్డు, పాస్‌బుక బ్యాంక్ ఖాతా జిరాక్సులు తీసుకురావాలన్నారు.

## మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

### రాలకత్వ గ్రామంలో బిఆర్‌ఎస్ గడపగడపకు ప్రచారం



జిన్నారం, నవంబర్ 06, మనం న్యూస్‌ః జిన్నారం మండలంలోని రాలకత్వ గ్రామంలో సోమవారం బిఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డికి మద్ధతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పదేళ్లుగా మహిపాల్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించి అసెంబ్లీకి పంపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్మన్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, మండల అధ్యక్షులు రాజేష్,సోలక్‌పల్లి డిసిసిబి చైర్మన్ గోపాల్‌రెడ్డి, స్థానిక ఎంపిటిసి స్వాతి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జింక పాండు, వార్డు సభ్యులు పల్లవి అంజి గౌడ్, కో ఆప్షన్ మెంబర్ ఇంతియాజ్, యువజన విభాగం అధ్యక్షులు ఆది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడం

-అబద్ధాల పునాదులపై గెలిచిన కేసీఆర్‌ను గద్దె దించాలి

-బీజేపి అధికారంలోకి వస్తే బిసి అభ్యర్థే ముఖ్యమంత్రి

-దుబ్బాకపై మంత్రి హరీష్‌రావుది సవతితల్లి ప్రేమ

-దుబ్బాక బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు




మిరుదొడ్డి, నవంబర్ 06, మనం న్యూస్‌: బిఆర్ఎస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తి లేదని దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలోని కొండాపూర్, అందె గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి కొండాపూర్, అందె గ్రామస్తులు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కుటుంబ పాలన మాత్రమే కొనసాగుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దొరలు మాత్రమే రాజ్యాన్ని ఏలుతారని ఎద్దేవా చేశారు. బీజేపి అధికారంలోకి వస్తే బిసి బిడ్డను ముఖ్యమంత్రి చేయడం ఖాయమన్నారు. భూమిలేని దళితులకు మూడెకరాల భూమి, ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అని మాయమాటలు చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటికీ పూర్తిగా హామీలు అమలు చేయలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ గద్దెనెక్కి




తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అబద్ధాల పునాదులపై గెలిచిన సీఎం కేసీఆర్‌ను గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సుమారు 1300 మంది అమరవీరుల ఆత్మహత్యల వల్ల ఏర్పడిన తెలంగాణలో కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే రాష్ట్రాన్ని ఏలుతుందని విమర్శించారు. మరోసారి తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే కేసీఆర్ లేదా కేసీఆర్ కుటుంబ



సభ్యులే సీఎం అవుతారు తప్ప బిసి సామాజిక వర్గానికి చెందిన వారు సీఎం కాలేరని ఆరోపించారు. బిసిలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తే అన్ని వర్గాలకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టి ప్రగతి భవన్‌లో కాలుపెట్టని ముఖ్యమంత్రి కేసీఆరే అని విమర్శించారు. బిఆర్ఎస్ అధికారంలో లేనప్పుడు మద్యం అమ్మితే పదికోట్ల ఆదాయం వస్తే ఇప్పుడు సుమారు 50 వేల పై చిలుకు కోట్ల ఆదాయం వస్తుందన్నారు. సిద్దిపేట ఒక కన్ను, దుబ్బాక ఒక కన్ను అని చెప్పే హరీష్‌రావు దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అందె గ్రామంలో బిఆర్ఎస్‌లో క్రియాశీల కార్యకర్తగా పని చేస్తున్న ఎక్కాల దేవిరంజిత్ భాజపాలో చేరగా రఘునందన్‌రావు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు, బీజేపి మండల ప్రధాన కార్యదర్శులు అమర్, యాదగిరి, బీజేపి నాయకులు మల్లేశం, రోశయ్య, బిక్షపతి, నవీన్‌రావు, నారాయణరెడ్డి, శ్రీనివాస్, లింగం, మధు, అందె, కొండాపూర్ గ్రామాల బిజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి... అభివృద్ధి చేస్తా

### బీజేపి అభ్యర్థి సంగప్ప



కంగ్టి, నవంబర్ 06, మనం న్యూస్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని నారాయణఖేడ్ బీజేపి అబ్యర్థి సంగప్ప పేర్కొన్నారు. కేంద్రం నిధులతో రాష్ట్రంలో సీఎం కేసీఆర్ జల్సా చేస్తున్నాడని ఖేడ్ బీజేపి అభ్యర్థి జెనవాడెసంగప్ప అన్నారు. సోమవారం కంగ్టిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి భారీ సంఖ్యలో బీజేపిలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో ఖేడ్‌లో బీజేపి జెండా ఎగురడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఖేడ్‌ను అభివృద్ధి చేయకుండా దగా చేశాయన్నారు. మీ బిడ్డగా మీ గడపకు వస్తున్నానని ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. బిఆర్ఎస్ అవినీతి, అరాచకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మామ అల్లుడు ఖేడ్ ప్రజలకు అబద్ధాల హామీలు ఇస్తున్నారన్నారు. కౌలాస్ నాలా నీళ్లు తెచ్చి ఖేడ్ ప్రజల కాళ్లు కడుగుతానని చెప్పి మోసం చేశారన్నారు. బీజేపి అధికారంలోకి రాగానే కౌలాస్ నాలా నీళ్లు తెచ్చి ఖేడ్‌ను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని సంగప్ప పేర్కొన్నారు.

# ప్రజలకు అందుబాటులో లేని ఎమ్మెల్యే వద్దు

### సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రోళ్ల శ్రీనివాస్

కొండాపూర్, నవంబర్ 06, మనం న్యూస్‌: ప్రజలకు అందుబాటులో లేని ఎమ్మెల్యే ప్రజల మధ్యలో వద్దని, ప్రజల కోసం నిరంతరం సేవ చేసే నాయకుడు కావాలని, అది బిఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అని సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్, సైదాపూర్ తాండ, సైదాపూర్ సీతారంకుంట తాండ, గోటిల గుట్ట మాచేపల్లి, దొబ్బకుంట తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతసాగర్‌లో ఆయనకు ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బైక్‌ర్యాలీతో అంబేద్కర్ విగ్రహం వరకు వచ్చి తన తనయుడు సాయినాథ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు జరుగుతున్నాయని, సంగారెడ్డి నియోజకవర్గంలో చింత ప్రభాకర్ పదవిలో లేకున్నా ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో లేని, ప్రజల మధ్య లేని ఎమ్మెల్యే మనకు వద్దని, మనకోసం, ప్రజల మధ్య నిలిచే నాయకుడు కావాలని, అది చింత ప్రభాకర్ అని ఆయన అన్నారు. కావున ప్రజలు ఈసారి ఎన్నికల్లో చింత ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. అనంతరం ఉమ్మడి జిల్లా సిడిసి ఛైర్మన్ పట్నం మాణిక్యం, అనంతసాగర్ ఉప



సర్పంచ్ ఇంద్రారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రఘునతారెడ్డి, అమీనుద్దీన్‌గ్రామాధ్యక్షులు రాములు, సి.హెచ్. రాజు, నర్సింలు, సైదాపూర్ గ్రామస్తులు మల్లాగౌడ్, మాజీ సర్పంచ్ రామా గౌడ్, లక్ష్మణ్ గౌడ్ గిరిజన మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎన్నికలకు దాఖలవుతున్న నామినేషన్‌లు










సిద్దిపేట రూరల్, నవంబర్ 06, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సోమవారం స్వతంత్ర అభ్యర్థులు ధర్మసమాజ్ పార్టీ, ప్రాప్త్ సామాన్య ప్రజా పార్టీ తరుపున నామినేషన్‌లను దాఖలు చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో వరికోలు శ్రీనివాస్, ఎక్కల లింగం స్వతంత్ర అభ్యర్థులు, దుబ్బాక నియోజకవర్గంలో రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ తరుపున గౌటి మల్లేష్, స్వతంత్ర అభ్యర్థిగా పెద్దలింగన్నగారి ప్రసాద్, ధర్మసమాజ్ పార్టీ తరుపున వేముల వెంకట ప్రసన్న, గజ్వేల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి బక్క సదేష్, హుస్నాబాద్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులు పచ్చిమడ్ల రవిందర్, సమ్మయ్య కాశవేని, ధర్మసమాజ్ పార్టీ తరుపున బోయిని సదన్ మహరాజ్‌లు నామినేషన్‌లు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు.



## కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

### -స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

సిద్దిపేట, నవంబర్ 06, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పొన్నాల శివారులోని ఇందూర్ కళాశాలలోని సిద్దిపేట నియోజకవర్గ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను, దుబ్బాక నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బలగాల డ్యూటీ సమయాలను, అటెండెన్స్ రిజిష్టర్‌ను, సిసి కెమెరాల పుటేజీ పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌కు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు కావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక మార్గాల వారీగా బారికేడ్ అమర్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసిపి సురేందర్‌రెడ్డి, ఏఆర్ఓ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్‌లు ఉన్నారు.

**-ఎన్నికల గోదాం పరిశీలన**

సమీకృత జిల్లా కార్యాలయం సముదాయం పక్కన నిర్మించిన ఎన్నికల గోదాంలో అదనంగా రూ. 2.20 కోట్లతో నిర్మించిన మొదటి అంతస్తు గోదాంను జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ సోమవారం పరిశీలించారు. చిన్నచిన్న పనులుంటే వేగంగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల సూపరిండెంట్ రామేశ్వర్, డిటి ఎలక్షన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# జోరుగా కాంగ్రెస్ ప్రచారం

## ఆయా గ్రామాల్లో పార్టీలోకి చేరికలు

కొండాపూర్, నవంబర్ 06, మనం న్యూస్ః కొండాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. మండలానికి పలువురు బిఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గారెడ్డి సుమారు 300 మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడగానే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందని, ఇది ఓర్వలేక బిఆర్ఎస్ విమర్శలు చేస్తుందన్నారు. మల్లెపల్లి, గోపులారం, తెర్పోల్, ఎదురుగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ప్రజల నుండి కాంగ్రెస్‌కు భారీ స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించడంతోపాటు తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎలాంటి అభివృద్ధికి కృషి చేయలేదని, కావున ప్రజలంతా కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. బిఆర్ఎస్ పథకాలన్నీ వారి నాయకులు, కార్యకర్తలకే అందాయి తప్ప సామాన్య ప్రజలకు అందలేదన్నారు. బంగారు తెలంగాణ నిర్మిస్తున్నామని చెప్తూ కల్వకుంట్ల కుటుంబం బంగారు కుటుంబంగా మారింది తప్ప ప్రజల



జీవితాలు బంగారుమయం కాలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు మొదలు అన్నిట్లో కమీషన్‌ల కోసమే బిఆర్ఎస్ నీచానికి దిగజారిందన్నారు. అదేవిధంగా గొల్లపల్లి లో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది, మనసాన్‌పల్లిలో 30 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ప్రభు, సొసైటీ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిపి మనోజ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, జనరల్ సెక్రటరీ గౌడ్‌చర్ల నర్సింలు, ఎంపిటిసిలు నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ కృపా కుమార్, తెర్పోల్ గ్రామ పార్టీ నాయకులు రాజు, మాజీ కృష్ణ, శివరాం గౌడ్, నరసింహారావు పంతులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌కే మా ఓటు: ఏకగ్రీవ తీర్మానం



జగదేవ్‌పూర్, నవంబర్ 06, మనం న్యూస్ః సీఎం కేసీఆర్‌కే మద్ధతుగా మా ఓట్లు వేస్తామని జగదేవ్‌పూర్ మండల పరిధిలోని కొత్తపేట గ్రామస్తులు స్పష్టం చేఆరు. సోమవారం ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి గ్రామంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సీఎం కేసీఆర్ ఒక్క మాటతో పరిష్కరించాడని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నార. ఈ మేరకు తమ సమస్యను పరిష్కరించిన సీఎం కేసీఆర్‌కే తమ మద్ధతంటూ గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానం చేసి, తీర్మాన పత్రాన్ని ఎఫ్‌డిసి ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మకు అందించారు. అనంతరం బీజేపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు బిఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70 ఏళ్ల నుండి ఉన్న భూ సమస్యలను ఏ ప్రభుత్వం పరిష్కరించలేదని, కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం తమ భూ సమస్యలను పరిష్కరించారని, ఇందుకు 450 మంది కలిసి తీర్మానం చేసుకున్నామన్నారు. తమ ఓటు కేసీఆర్‌కే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాలేశం గౌడ్, జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిపక్షాలకు ఓటు అడిగే హక్కు లేదు

### బిఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 06, మనం న్యూస్ః కాంగ్రెస్ బీజేపిలకు ఓటు అడిగే హక్కు లేదని బిఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మద్దికుంట శేఖర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, బొబ్బిలిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు మెంబర్ రమేష్, కృష్ణారెడ్డి, ఇరు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు బిఆర్ఎస్‌కే ఉందని, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుల మతాలకు చిచ్చు పెట్టే బీజేపి పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. అభివృద్ధిపథంలో దూసుకుపోతున్న తెలంగాణ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. చింతా ప్రభాకర్ నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అరీఫొద్దీన్, ఎంపిటిసి సత్యనారాయణ, సంతోష్‌గౌడ్, సర్పంచ్లు నల్లుల కుమార్, నరేష్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్‌లు సురేష్ తదితరులు పాల్గొన్నారు.